**కథ**

# గోస్తని

**ఆవుని ప్రేమగా నిమిరి, నాలుగు గడ్డిపరకలు వేస్తే చాలు, అమృతధారలు కురిపిస్తుంది, అపరిచితునికైనా. కానీ దానిని కొట్టి, బంధించి పాలు పిండాలంటే హక్కుదారునికైనా తన్నులు తప్పవు మరి.**

★ ★ ★

తూర్పు ఎర్రబడి చాలాసేపయింది. పల్లెలోని జనానికి ఎప్పుడో తెల్లవారింది. పనిపాటలతో హడావిడిగా ఉన్నారు.

సూరిగాడు గబగబా నడుచుకుంటూ వస్తున్నాడు. వాడు నిద్ర లేచేటప్పటికీ చాలా పొద్దెక్కింది. అందువలనే వాడు పొలం వెళ్ళడానికి ఆలస్యమయింది.

తొందరగా అడుగులు వేస్తున్న సూరిగాడు ఎదురుగా కనిపిస్తున్న ఎత్తు అరుగుల ఇల్లు చూసి నడకని పరుగులా మార్చాడు.

''ఏరా సూరిగా! ఏటీ పొద్దు ఆలీసమైపోనాదా?'' ఎవరో పలకరింపుగా అడిగిన ప్రశ్న వాడి చెవిన పడలేదు. త్వరగా ఆ ఎత్తరుగుల ఇల్లు దాటేయాలని వాడి ప్రయత్నం.

ఆ ఎత్తరుగుల ఇంట్లో ఉన్నది పులో, సింహమో కాదు, భయంకర సర్పమూ కాదు. పోనీ పనివాళ్ళని పీల్చిపిప్పిచేసే కామందులు కూడా లేరు.

మరెవరు?

గోదావరమ్మ, అవును గోదావరమ్మే!

''ఒరే సూరిగా!'' కంచుగంటలాంటి కంఠం వినిపించింది. వాడిలో నిస్సత్తువ ఆవరించింది. ఇక తప్పించుకోవడానికి వీల్లేదు. అమ్మగారు చూసేసారు.

ఇక తప్పేది లేదని మెల్లగా నడుచుకుంటూ ఎత్తరుగుల ఇంటి వద్దకు వెళ్ళాడు.

''దండాలమ్మగోరూ! ఏంటమ్మా పిలిచారు?'' చేతులు కట్టుకుని ప్రశ్నించాడు.

''ఏరా! ఇంటివైపు కూడా చూడకుండా పోతున్నావు'' ప్రశ్నించింది ఆమె.

''మరే..మరే..అదీ..ఉదయాన్నే తెలివిరాలేదమ్మా! పొలం వెళ్ళడానికి ఆలీసమైపోనాదని ఎల్లిపోతున్నానమ్మా!'' నసిగాడు సూరిగాడు.

''సర్లేగానీ! నీ పెళ్ళాం పురిటికెళ్ళింది కదూ! వండుకుని తింటున్నావా, లేదా?''

''ఆ! తింటున్నానండమ్మా!''

''ఈ పూట చద్దన్నం తిన్నావా? లేక కడుపుమాడ్చుకుని పొలానికి పరిగెడుతున్నావా?'' గోదావరమ్మ వేసిన ఈ ప్రశ్నకి సంకటస్థితిలో పడ్డాడు సూరిగాడు.

తిన్నాను అంటే ఏం తిన్నావు, ఎప్పుడు తిన్నావు, నువ్వు వండుకున్నావా, ఎలా వండావు, ఇలాంటి ప్రశ్నలు వేస్తారు. తినలేదంటే ఏదో ఒకటి తినడానికి పెట్టి, కడుపునిండేవరకు ఒప్పుకోరు. ఎట్టాగబ్బా!-సూరిగాడిలో ఆలోచనలు.

''ఏరా మాట్లాడవు'' గద్దించినట్లు అడిగింది ఆవిడ.

''కడుపులో కొంచెం గడబిడగా ఉందమ్మా! ఏటీ తినాలని లేదు'' నీళ్ళు నములుతూ చెప్పాడు.

''అదీ సంగతి. అందుకే నీ మొహం వాడిపోయింది. రా కూచో. వేడిగా ఆవిరి కుడుం చేసాను. తినివెళ్దువుగాని''

''వద్దండమ్మా! చెప్పాగా, కడుపులో బాలేదని...'' చెప్పబోతున్న వాడి మాటలు వినకుండానే లోపలికి వెళ్ళి అరిటాకులో పెద్ద కుడుం, కారప్పొడి వేసుకొచ్చింది ఆవిడ.

ఆ కుడుం చూడగానే పై ప్రాణాలు పైనే పోయాయి సూరిగాడికి.

''అమ్మగోరూ! పొలం తొందరగా వెళ్ళకపోతే కామందు కోప్పడతాడండీ!''

''ఎవరూ వీరయ్యేగా! నే చెప్తాలే వాడికి. నువ్వు కానీ'' అంటూ ఇత్తడి చెంబు నిండా మంచినీళ్ళు తెచ్చిచ్చింది ఆమె.

పొగలు కక్కుతున్న ఆవిరి కుడుం సూరిగాడి ఆకలిని రెట్టింపు చేసింది.

ఆవురావురుమని తినేసాడు.

''పిచ్చినాగన్నా! ఇంత ఆకలి కడుపులో పెట్టుకుని వెధవ అబద్ధాలూ, నువ్వూనూ'' అంటూ ఆప్యాయంగా నవ్వింది గోదావరమ్మ.

★ ★ ★

పచ్చని ఛాయ, తిలతండుల న్యాయాన్ని స్ఫురింపచేసే తలకట్టు,

కాషాయరంగు చీర, జాకెట్టు, మెడలో తులసి, రుద్రాక్షమాలలు... ఇవీ గోదావరమ్మ రూపురేఖలు.

అనురాగపు చూపులు, ఆప్యాయపు పలుకులు ఆమెకున్న సహజ లక్షణాలు. కరుణ, పరోపకారం ఆమెకు పెట్టని ఆభరణాలు. ఆమె బోలెడంత భూమీ, పుట్రా, నగా, నట్రాతో ఆ పల్లెలో అడుగుపెట్టింది, కోడలిగా.

ఆమెకున్న చరాస్తులన్నీ కాళ్ళొచ్చి వెళ్ళిపోయాయి. ఆమెకి పసుపు, కుంకుమలుగా పుట్టింటి వారిచ్చిన భూమి మాత్రం కొంచెం మిగిలింది.

ఆవిడ భర్త బతికున్న రోజుల్లో పూటకి పది, పదిహేనుమంది భోజనానికి కూచునేవారని జనాలు చెప్పుకుంటారు. అతిథి, అభ్యాగతులని ఆదరించే సరికే వారి ఆస్తంతా కరిగిపోయింది. అయినా ఏనాడూ ఆ దంపతులు బాధపడలేదు. చిరునవ్వుతో వచ్చినవారిని ఆహ్వానించేవారు. రాని వారిని బలవంతపెట్టి ఇంటికి తీసుకొచ్చేవారు.

ఆ పుణ్యదంపతులకు ఒక్కడే కొడుకు. కొడుకును పెద్ద చదువులు చదివించాలన్న కోరిక గోదావరమ్మ భర్తది. ఆ అబ్బాయి తెలివైనవాడు కావడంతో విదేశాలలో చదువుకుని, అక్కడే పెద్ద ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

తండ్రి చనిపోయినపుడు ఒకసారి వచ్చి వెళ్ళాడంతే. ఆ తర్వాత మరి రాలేదు. ఆవిడ ఒక్కగానొక్క కొడుకు కోసం ఎదురు చూస్తూనే ఉంది. మంచి సంబంధం కుదిర్చి అతడికి ఉత్తరాలు రాస్తే, తను ఎప్పుడో పెళ్ళి చేసుకున్నానంటూ ఉత్తరం రాస్తూ, భార్య ఫొటో పంపించాడు. కొందరి ఊహలు నిజమయ్యాయి. ఎవరో తెల్ల దొరసానిని పెళ్ళాడాడు. అయినా నిండు గోదారిలా ఆమె తొణక లేదు. కోడలిని తీసుకురమ్మంది. ఇప్పుడప్పుడే ఇండియాకు రావడం వీలు పడదని ఉత్తరం రాసాడు కొడుకు.

అడపాదడపా వచ్చే ఉత్తరాల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. అసలు సంగతి అవగతమయింది ఆమె మనోగతానికి. తన కొడుకు విదేశాలు ఇచ్చే విలాసాలలో పడి చిన్నప్పుడు పంతులుగారు నేర్పిన 'జననీ జన్మభూమిశ్చ..' శ్లోకాన్ని విస్మరించాడని ఆమె గ్రహించుకుంది.

తన కడుపున పుట్టిన బిడ్డ ఒకడే. అయితేనేం, భగవంతుడు నవమాసాలు మోసే కష్టం లేకుండా, ప్రసవ వేదన తెలియకుండానే ఊరందరినీ తన బిడ్డలుగా ఇచ్చాడనుకుంది గోదావరమ్మ. ఆ ఊరిలో జనాలకి దేవత గుళ్ళో లేదు. ఆ ఎత్తరుగుల ఇంట్లో ఉంది. ఆమె అతి ప్రేమ భరించలేక తప్పించుకుపోదామని చూసే సూరిగాడిలాంటి వాళ్ళని ఆమె ప్రేమాస్పదమైన పలుకులతో కట్టిపడేస్తుంది.

ఆ పల్లెలో ఎవరింట్లో ఏ శుభకార్యమైనా ఆవిడే పసుపు దంచాలి. నేను ముత్తయిదువును కానత్రా అని ఆమె గోలపెడుతున్నా ఎవరూ వినరు. అనుకోని అశుభానికైనా తొలి సానుభూతి వాక్యాలు

ఆమెవే.

కష్టానికీ, సుఖానికీ అందరికీ, అన్నింటికీ గోదావరమ్మే ఆ ఊర్లో.

చినరాయుడుగారింట్లో సీమంతమైనా, మునసబుగారింట్లో ముద్దకుడుముల పేరంటానికైనా, ప్రెసిడెంటుగారింట్లో పెళ్లికైనా, సర్పంచ్ కూతురు సమర్తాడినా అన్నింటికీ ఆవిడే స్వయంగా మితాయిలు తయారుచెయ్యాలి.

ఎవరైనా, ఏ శుభవార్త తీసుకువచ్చినా వాళ్ళని వట్టినే పోనిచ్చేదికాదు. ధాన్యమో, కందులో, పళ్లో, కూరగాయలో..ఏవో ఒకటి ఇచ్చిగానీ పంపేది కాదు. వీధిలో ఆడుకునే పిల్లలకోసం జంతికలు, చేగోడీలు, చక్కిలాలు, కరకజ్జం ఇలాంటి చిరుతిళ్ళు చేసి ఉట్లల్లోని కారేజీల్లో దాచేది. అటుగా పోతున్న పిల్లల్ని పిలిచి ఏవో ఒకటి చేతిలో పెడితేనేగానీ ఆవిడకి తృప్తిగా ఉండదు.

ఉక్కులాంటి శరీరం ఆమెది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆవిడలేని ఆ పల్లెను ఊహించలేరు ఎవరూ.

★ ★ ★

గోదావరమ్మలో ఆనందం ఉప్పొంగే వరదగోదారే అయింది. ఆమెలో సంబరం అంబరాన్నంటుతోంది. నేలమీద కాలు నిలవడం లేదు.

ఆ సంతోషోద్వేగానికి కారణం..ఆవిడ కొడుకు దగ్గర నుండి ఉత్తరం రావడమే.

ఉత్తరం తెచ్చిచ్చిన పోస్ట్‌మేన్ నోటినిండా సున్నుండ కూరేసింది. రెండు కుంచాల కందులు, పెరట్లో పండిన కూరగాయలు ఇచ్చింది అతనికి.

'అతి మంచితనం కూడా చాలా కష్టం. భరించలేం సుమా' అనుకుంటూ పోయాడతడు.

తనేదో ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటున్నట్లు, అందు నిమిత్తమై వస్తున్నట్లుగా రాసాడు అతడు ఉత్తరంలో.

ఏదయితేనేం! ఫ్యాక్టరీ పెట్టేమాటయితే, దానిని చూసుకుంటూ కొడుకు ఇక్కడే, తన కళ్ళ ముందే ఉండబోతున్నాడన్న ఆలోచనే ఆమెకు అంతులేని ఆనందాన్నిస్తోంది.

ఆమె కళ్ళు వెలిగించని దీపాలయ్యాయి. మనసు పురివిప్పిన నెమలే అయింది.

కొడుకు రాబోయే సమయం కోసం ఎదురుతెన్నులు చూస్తోంది ఆమె.

కొడుకుకి ఏమేం ఇష్టమో అన్నీ తయారుచెయ్యడంలో తలమునకలుగా ఉంది ఆమె.

ఆమె ఎదురుచూసిన రోజు రానే వచ్చింది.

భార్య, పిల్లలతో సహా వచ్చాడు కొడుకు. ఆ తల్లి మనసు రెక్కలొచ్చిన విహంగంలా విహరిస్తోంది. కొడుకు కూడా అన్ని రోజులు ఆమెను వదిలేసి ఉన్నందుకు ఎంతో నొచ్చుకున్నాడు. కోడలికి ఈ పల్లె వాతావరణం నచ్చలేదు. అంటీ ముట్టనట్లుగా ప్రవర్తిస్తోంది. తనను చూడాలని వచ్చే జనాన్ని చూసి ముఖం చిట్లించింది.

కొడుకు, కోడలు కూడా సున్నితంగా తినడం ఆమెకు బాధ కలిగించినా, మనవలు తను చేసిన తినుబండారాలని ఆసక్తిగా తినడం ఆమెకు తృప్తినిచ్చింది.

పగలంతా తల్లి దగ్గర కూచుని తన చిన్ననాటి కబుర్లన్నీ గుర్తు చేసుకున్నాడు.

కొడుకు విదేశీమోజులో పడి తనని విస్మరించలేదన్న ఆత్మసంతృప్తి ఆమెను నిలువెల్లా కమ్మేసింది.

రాత్రి భోజనం చేసాక మంచం మీద తల్లి పక్కనే పడుకుని మాట్లాడనారంభించాడు.

''అమ్మా! నేను విదేశాల్లో చాలా డబ్బు సంపాదించాను. ఆ డబ్బుతో ఇక్కడ ఒక ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటున్నాను''

''చాలా సంతోషం నాయనా! నువ్వింత అభివృద్ధిలోకి రావడం చూసే అదృష్టం ఆయనకు లేకపోయింది'' కంట తడిపెట్టింది గోదావరమ్మ.

''ఆ పెట్టేదేదో దూరంగా ఎందుకు? మన ఊర్లోనే పెడదామనే ఉద్దేశ్యం కలిగింది నాకు''

''మంచిదే నాయనా! ఊరు బాగుపడుతుంది''

''దానికోసం స్థలం ఎక్కడుందాని ఆలోచిస్తున్నా



**హేమమాలిని**

నమ్మా!''

''ఊరి చివర ఏమైనా ఉన్నాయేమో కను క్కుందాం లేరా?''

''ఎక్కడో ఎందుకమ్మా! మనవే ఉన్నాయిగా'' నసిగాడు అతడు.

''ఏమిట్రా నువ్వనేది?'' అర్థం కాలేదు ఆమెకి.

''మన పొలాలు ఉన్నాయి కదామ్మా! వాటి స్థానంలో ఫ్యాక్టరీ కడదామని అనుకుంటున్నాను'' అతని మనసులోని మాట స్పష్టమైంది.

ఒక్కసారిగా ట్రాన్సుడిపోయింది గోదావరమ్మ.

''అవేమీ బీడు భూములు కావురా. మంచి ఫల సాయం వచ్చే స్థలాలు'' మెల్లిగా చెప్పింది.

''నిజమేనమ్మా! కానీ ఈరోజుల్లో వ్యవసాయం ఏమాత్రం లాభాన్నివ్వడం లేదు. ప్రపంచమంతా కంప్యూటర్ల వైపు పరుగెడుతూ ఉంటే ఇంకా వ్యవ సాయాలెందుకమ్మా! ఇక్కడ ఫ్యాక్టరీ కట్టించి, నా ఫ్రెండ్స్‌కి అప్పచెప్పి, నిన్ను కూడా మాతో అమె రికా తీసుకెళ్ళిపోదామనుకుంటున్నాను'' కచ్చి తంగా అన్నాడు.

దెబ్బమీదదెబ్బ! నిర్ఘాంతపోయింది గోదావరమ్మ.

''అదేంట్రాకన్నా! నువ్వు శాశ్వతంగా ఇక్కడ ఉండడానికి వచ్చావని నేను ఆశపడ్డాను!'' ఆవేదన వ్యక్తం చేసింది ఆమె.

''ఇక్కడేముందమ్మా! పూర్ కంట్రీ. అమెరి కాలో నాకు స్వంత ఇల్లు, కారు అన్నీ ఉన్నాయి. అంతకుమించి విలాసవంతమైన జీవితం ఉంది. అవన్నీ ఇక్కడెలా దొరుకుతాయి? ఇక్కడ పుట్టిపె రిగిన నాకే ఈ వాతావరణం ఇంత రోతగా ఉంటే, అక్కడ సంస్కృతి అడుగడుగునా జీర్ణించుకున్న డాలీ, పిల్లలు ఎలా ఉండగలరు?'' ప్రశ్నించాడు అతడు.

గోదావరమ్మకు విషయం అర్థమైంది. తను రాలి పోయే ఆకులాంటిది. అందుకే తను బతికుండ గానే తన పేరుమీదున్న భూమి, ఇల్లు అతడికి అను కూలంగా మార్చుకుందామని వచ్చాడు. అంతేకానీ తనపై ప్రేమతో కాదు. ఆమె మనసు అట్టుడికిపో తోంది.

''కన్నా! నీకు విదేశాలు ఇచ్చే డబ్బు జబ్బు నరనరానా పట్టి పీడిస్తోంది. నువ్వు నా మీద ప్రేమతో వచ్చావని మురి సిపోయాను. కానీ నువ్వు అక్కడ ఎక్కు వగా సంపాదించిన డబ్బు ఇక్కడ ఖర్చు చేయాలని వచ్చావు. నువ్వు చెప్పినదానికి నేను అంగీకరించలేను. నేను బతికుం డగా ఈ ఊరు వదలి రాలేను''

''అమ్మా! మూర్ఖంగా ఆలోచిస్తావేం? నీకు నేను తప్ప ఎవరున్నారు? ఇక్కడ వ్యవహారాలన్నీ చూసుకుని, నువ్వు నాతో వచ్చి తీరాల్సిందే'' గట్టిగా అరి చాడు.

''చదువుకోసమని అమెరికా వెళ్ళిన నువ్వు అక్కడే పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కన్నావు. అప్పుడు గుర్తులేదా నాన్నా, ఈ అమ్మకు ఇంకెవరూ లేరని. కానీ నువ్వనుకుంటున్నట్లు నాకెవరూ లేకపోలేదు. ఈ పల్లెలోని జనమంతా నా వాళ్ళేరా!''

''పై వాళ్ళు మన వాళ్ళవుతారా?'' కోపం ప్రతిధ్వ నించింది అతని గొంతులో.

''మీ నాన్నగారి అనారోగ్యమపుడు, ఆయన అంత్యక్రియలప్పుడు వీళ్ళేరా నన్ను ఆదుకుంది'' ఆ పల్లెజనాల మీద అంతులేని వాత్సల్యం ప్రకటిత మైంది ఆమె మాటల్లో.

''సరే! నీ మొండి వాదన అలాగే కానీ! నీకు ఒక ఎకరం పొలం ఉంచుకుని మిగిలినది నాకిచ్చేయి. ఉండడానికి ఎలాగూ ఇల్లుంది. అయినా నీ తర్వాత ఎలాగూ నాకే కదా!'' అసహనంగా అన్నాడు.

''ఒరే! ఇది పిత్రార్జితం కాదు. మా పుట్టింటి వాళ్ళు నాకు పసుపు, కుంకుమలుగా ఇచ్చినది. మన డబ్బంతా అయిపోయినప్పుడు కూడా మీ నాన్నగారు దీనిని అమ్మడానికి ఇష్టపడలేదు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎందరికో అన్నం పెడుతూ వచ్చిన భూమి అది. నువ్వు ఇక్కడ ఉండి అనుభవించు. నీతోపాటు నలుగురికీ అన్నం పెట్టు. అంతేకానీ అన్నపూర్ణని నాశనం చేస్తానంటే నేను ఇవ్వను'' ఖరాఖండిగా చెప్పేసింది ఆమె.

''నీకు తలకొరివి పెట్టాల్సిన వాడిని నేనని మరచి పోతున్నావు''

''నువ్వు నా దగ్గర లేకుండా, నేను చచ్చాక అంత దూరం నుంచి వచ్చి తలకొరివి పెడతావనే ఆశ నాకు లేదురా'' అంతే పంతంగా అంది గోదావ రమ్మ.

''సరే! ఈరోజు నుంచీ నీకూ, నాకూ సంబంధం లేదు'' అంటూ అప్పటికప్పుడు ప్రయాణమై, భార్యాపిల్లల్ని తీసుకుని వెళ్ళిపో యాడు.

గోదావరమ్మ హృదయాన్ని ఎవరో తడిబట్టని పిండుతున్నంత గట్టిగా నలిపేసినట్లయింది. అవ్యక్త మైన ఆవేదన ఆమెను ఆవహించింది.

★ ★ ★

తెల్లవారేసరికి గోదావరమ్మ కన్ను మూసిందన్న వార్త విని పల్లెంతా శోకసంద్రంలో మునిగిపో యింది. ఆ ఊరిలోని ప్రజలేకాక, పక్క ఊళ్ళ నుంచి కూడా జనాలు తండోపతండాలుగా రాసా గారు. వారి దుఃఖానికి అంతులేదు. తమకు సంబం ధించిన మనిషిని పోగొట్టుకున్నట్లు ఏడుస్తున్నారు ప్రతి ఒక్కరూ.

ఆమె పడుకునే మంచం పక్కన బల్లమీద ఒక ఉత్తరం కనిపించింది. వణికే చేతుల్తో సూరిగాడు దాన్ని తెచ్చాడు.

''ఈ పల్లెలోని వారందరికీ నా ఆశీస్సులు. ఈ ఊరికీ, నాకూ ఋణం తీరిపోయిందేమోనర్రా! బాధపడద్దు. నేను మనిషిని ఉండనే కానీ, మనసు మీ చుట్టూ తిరగక ఇంకెక్కడికి పోతుందర్రా!

నా ఇల్లు ఒక బడిగా మారితే పై లోకం నుంచే చూసి ఆనందించాలనుంది. ఆ బడిలో మాష్టారు పాఠాలు చెపుతూ ఉంటే మన ఊరిలోని పిల్లలం దరూ నేర్చుకుంటున్న దృశ్యం అప్పుడే నా కళ్ళ ముందు కనిపిస్తోంది. పాపం! ఆ మాష్టారు కూడా బతకాలి కదర్రా! అందుకే నా భూమి మీద వచ్చే ఆదాయంతో అతనికి భృతి ఏర్పరచండి.

నా పొలంలో పండే పంటంతా ఊరిలోని పేద లకు పంచండి. ప్రతి ఏడాదీ ఇదేరోజు అందరూ కలిసి నా ఇంట్లో భోజనాలు చెయ్యడం మరచిపో కండేం!

ఆఖరి మాట. నా దహన సంస్కారాలు మీరే చెయ్యాలర్రా! నా కొడుకు వచ్చినా వాడు నా శవాన్ని తాకకూడదు. వాడొక్కడే నా బిడ్డని వాడి ఉద్దేశ్యం. కానీ మీకు తెలియదర్రా, మీరంతా నా పిల్లలేనని.

ఉంటానర్రా మరి!''

ఉత్తరం చదువుతుండగానే ప్రెసిడెంట్ రామయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''అమ్మా!'' అంటూ ఆవిడ శవం మీద పడి ఏడవసాగాడు.

అందరూ కలిసి ఆమె అంతిమ సంస్కారాలు ఘనంగా జరిపించారు. ఒక బండి నిండా పూలు పరిచి దానిలో ఆమెని ఊరేగించారు.

పల్లెంతా వెల్లువలా కదిలింది. అశేష జనవాహిని మధ్య నిర్మలంగా సాగిపో తోంది ఆమె అంతిమ యాత్ర.

ఆమె కొడుకుకి విధించిన శిక్ష అతనికి తెలిసినా, తెలియకపోయినా ఆమెకి సంబంధం లేదు. తన మట్టుకు తను శిక్షను అమలు చేసేసింది.

అమెరికా సంస్కృతి వంటబట్టిన అత నికి ఆమె చివరిలేఖ పెద్ద బాధ కలిగించ కపోవచ్చు. కానీ మనసున్న వాడికెవరి కైనా అదే మరణశిక్ష. ✪

